


జాతీయస్థాయి పోటీలకు ప్రమోదిని ఎంపిక


ప్రమోదిని సత్కరిస్తున్న హెచ్ఎం రామోజీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరు జెడ్‌పి హైస్కూల్ విద్యార్థిని వి.ప్రమోదిని జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. కృష్ణాజిల్లా మచిలీపట్నం నోబుల్ కళాశాలలో ఎస్‌జిఎఫ్ అండర్-14లో ఈ నెల 24న జరిగిన బాలికల విభాగంలో విద్యార్థిని రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. జనవరిలో జరగనున్న జాతీయ జట్టుకు ఎంపికైంది. ఈ సందర్భంగా అల్లూరు జెడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్.రామోజీ, ఎస్ఎంసి ఛైర్మన్ ఎస్.వెంకటశ్యామల, గ్రామ ప్రముఖులు, ఉపాధ్యాయులు ప్రమోదినితో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు రాంబాబులను సత్కరించి అభినందించారు.

22ఎ భూసమస్యలపై మెగా క్యాంప్..!



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

15లోపు కలెక్టరేట్‌లో ఫిర్యాదుల స్వీకరణ, 30 రోజుల్లో పరిష్కారం

గత ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం, స్థలాల కొనుగోలులో అవకతవకలపై చర్యలు

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు.. సొమ్ము జమ

డిఆర్‌సి సమావేశంలో ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

కొత్తగా ఒక్క ఇల్లూ లేదు, 2014-19 మధ్య నిర్మించుకున్న ఇళ్లకు సొమ్ములివ్వలేదన్న ఎంఎల్‌ఎలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో 22ఎ భూసమస్యల పరిష్కారానికి డిసెంబర్ 15వ తేదీలోపు ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణకు మెగా క్యాంపు నిర్వహించి, అందిన ఫిర్యాదులను 30 రోజుల్లోగా పరిష్కరించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశపు హాలులో బుధవారం జిల్లా సమీక్షా సమావేశం (డిఆర్‌సి) జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు, చిర్రి బాలరాజు, సొంగా రోషన్‌కుమార్, కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ, ఇతర అధికారులు పాల్గొన్నారు. సమావేశంలో 22ఎలోని భూసమస్యలు, ధాన్యం కొనుగోలు, గృహనిర్మాణం వంటి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ 22ఎ కింద నమోదైన భూముల్లో జిరాయితీ భూములు ఉన్నాయన్నారు. దీంతో సదరు భూయజమానులు తమ భూములు అమ్ముకునేందుకు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటికి శాశ్వత పరిష్కారం అందించేలా సిఎం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ 22ఎ జాబితాలో పొరపాటుగా నమోదైన భూముల వివరాలను సేకరించాలన్నారు. ప్రయివేట్ భూములను ఉద్దేశపూర్వకంగా 22ఎ జాబితాలో చేర్చారని, అలాంటి అధికారులను గుర్తించి చర్యలు తీసుకోవాలని అన్నారు. మెగా క్యాంప్‌పై గ్రామస్థాయిలో ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం చేయాలన్నారు. రాష్ట్రంలో ఇంతవరకూ 50.86 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామని, గత ఏడాదికన్నా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఇంతవరకు అధికంగా సేకరించామన్నారు. వాతావరణ శాఖ తుపాన్ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం తడిచిపోకుండా ఉండేలా రైతుల వినియోగార్థం రైతుసేవా కేంద్రాల వద్ద 25 టార్పాలిన్లు సిద్ధంగా ఉంచేలా చర్యలు చేపట్టామన్నారు. టార్పాలిన్లు రైతులకు ఉచితంగా అందిస్తామన్నారు. జిల్లాలో ధాన్యం సేకరణ నిమిత్తం 65 లక్షల నాణ్యమైన గోనె సంచులను సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లాలో రోడ్ల గుంతలు లేకుండా చూడాలని, ఏలూరు నుండి ఆశ్రం ఆసుపత్రికి వెళ్లే రహదారికి వెంటనే మరమ్మతులు చేసి, స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏలూరు కేన్సర్ ఆసుపత్రి వద్ద రోడ్డు కూడా మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. జిల్లాలో వచ్చే మార్చి నాటికి పురోగతిలో ఉన్న 38 వేల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలన్నారు. జిలాల్లో పేదల ఇళ్ల స్థలాల కోసం డిమాండ్ సర్వే చేశామని, దరఖాస్తు చేసుకున్నవారిలో 2,602 మంది పేదలను అర్హులుగా గుర్తించామన్నారు. మొదటి విడతలో 90 మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించి ఇళ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, మిగిలిన వారికి భూములను గుర్తించి త్వరలో ఇళ్ల స్థలాలు అందిస్తామన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ మంచి వాతావరణంలో సమావేశం జరిగిందని, 22ఎ భూసమస్యలపై గ్రీవెన్స్ ఏర్పాటు చేసి పరిష్కార చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

2014-19లో ఇళ్లు నిర్మించుకున్నవారికి సొమ్ములివ్వాలి



పత్సమట్ల ధర్మరాజు, ఉంగుటూరు ఎంఎల్‌ఎ

2014-19లో ఇల్లు మంజూరై నిర్మాణం మధ్యలో ఆగిన లబ్ధిదారులకు గత ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. వారికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి. బకాయిలు వెంటనే చెల్లించాలి. ఉంగుటూరు నియోజకవర్గంలోని పెదనింద్రకొలనులో 2016లో ఇళ్లస్థలాలు మంజూరు చేసి, తరవాత రద్దు చేశారు. వారిలో అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి.

కాలనీల్లో కనీస వసతులు కల్పించాలి



బడేటి రాధాకృష్ణ, ఏలూరు ఎంఎల్‌ఎ

ఏలూరు పట్టణ ప్రాంతంలో పేదల గృహనిర్మాణ లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి. అప్పుడే నివాసం ఉండటానికి వీలుంటుంది. ఏలూరు నియోజకవర్గంలో 22ఎ జాబితాలో చేర్చిన అభ్యంతరాలకు సంబంధించి ఫిర్యాదులు చాలాకాలం నుండి పెండింగ్‌లో ఉన్నాయి. వాటిని పరిష్కరించాలి. గత వ్యవసాయ సీజన్‌లో ధాన్యం సేకరణలో రవాణా ఛార్జీల బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

సరిపడా యూరియా ముందుగానే ఇవ్వాలి



చిర్రి బాలరాజు, పోలవరం ఎంఎల్‌ఎ

పోలవరం మండలంలో భూములు చాలా దూరంగా ఉంటాయి. యూరియా సరిపడా ముందుగానే ఇస్తే రైతులకు మేలు జరుగుతుంది. పిఎం జన్మన్‌లో ఇచ్చిన ఇళ్లస్థలాలకు ఫారెస్ట్ అధికారులు అనుమతులు ఇవ్వడం లేదు. సమస్యను పరిష్కరించాలి.

ఇళ్ల స్థలాల కొనుగోలులో అవినీతిపై చర్యలు తీసుకోవాలి



చింతమనేని ప్రభాకర్, దెందులూరు ఎంఎల్‌ఎ

గత ప్రభుత్వ హయాంలో పేదలకు ఊరు చివర లోతట్టు ప్రాంతాల్లో భూములు కొనుగోలు చేసి పట్టాలు ఇచ్చారు. భూముల కొనుగోలులో ఎకరానికి రూ.20 లక్షలకుపైగా అవినీతి జరిగింది. విచారణ చేసి, దోషులపై చర్యలు తీసుకోవాలి. అర్హులకు ఇళ్ల స్థల పట్టాలు అందించేలా చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక కొత్తగా ఒక్క ఇల్లూ కూడా ఇవ్వలేదు. జిల్లాలో ఆయిల్‌పామ్‌తో సమానంగా కొబ్బరి, కోకో పంటల దిగుబడికి అవకాశం ఉంది. గుర్తింపు లేని కొన్ని నర్సరీల్లో నాసిరకం కొబ్బరి మొక్కలు సరఫరా చేస్తున్నారు. వారిని గుర్తించి కేసులు నమోదు చేయాలి.

ఇళ్ల నిర్మాణం, స్థలాల సేకరణలో తప్పు చేసిన వారిపై క్రిమినల్ చర్యలు



కొలుసు పార్థసారథి, మంత్రి

పేదలకు ఇళ్ల నిర్మాణంలో అవకతవకలకు పాల్పడి బిల్లులు తీసుకున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, రెవెన్యూ రికవరీ చట్టం కింద వసూలు చేస్తాం. ప్రజల ప్రయివేట్ భూములను ఉద్దేశపూర్వకంగా కొంత మంది అధికారులు 22ఎ జాబితాలో చేర్చారు. అటువంటి అధికారులపై చర్యలు తీసుకోవాలి. పేదల ఇళ్ల కాలనీలకు విద్యుత్, నీరు, రహదారి సదుపాయాలు కల్పించాలి.


ఏలూరులో నినదిస్తున్న ఎస్‌కెఎం నేతలు, కార్యకర్తలు

లేబర్ కోడ్‌లపై గరంగరం

ఉపసంహరించుకోవాలంటూ కార్మిక, రైతు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసనలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


జంగారెడ్డిగూడెంలో..

రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించాలని, కార్మిక హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని వివిధ రైతు, కార్మిక, వ్యవసాయ కూలీ సంఘాల నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్రంలోని మోడీ, అమిత్ షా ప్రభుత్వం అవలంబిస్తున్న రైతాంగ, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు బుధవారం ఏలూరులో భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, ఎపి రైతుసంఘం, ఎపి రైతుకూలీ సంఘం, గిరిజన సంఘం తదితర సంఘాల ఆధ్వర్యాన ఆర్‌ఆర్‌పేట, ఫైర్ స్టేషన్ సెంటర్, కొత్త బస్టాండ్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అనంతరం చేపట్టిన ధర్నాలో నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. ఈ సందర్భంగా ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస డాంగే అధ్యక్షతన జరిగిన సభలో రైతు, కూలీ సంఘం (ఎపి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింహాద్రి ఝాన్సీ, సిఐటియు రాష్ట్ర సహాయ కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, బికెఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యువి, ఎఐయుకెఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌కె.గౌస్, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి డేగా ప్రభాకర్ తదితరులు మాట్లాడారు. కేంద్రంలోని మోడీ, అమిత్‌షా ప్రభుత్వం మూడోసారి తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలను మరింత దూకుడుగా అమలు చేస్తోందని విమర్శించారు. కార్మిక వర్గం తరతరాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో ప్రధానమైన 29 చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు, యాజమాన్యాలకు మేలు చేసేలా నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి ఏకపక్షంగా అమలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కూడా కేంద్రం బాటలోనే నడుస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిందనీ, రైతాంగ సమస్యలను, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల జిల్లా నేతలు కె.కృష్ణమాచార్యులు, దొంత కృష్ణ, కట్టా భాస్కరరావు, పి.రామకృష్ణ, కెవి.రమణ, ఎం.ఇస్సాక్, వైఎస్.కనకారావు, కుంజం రామారావు, భాషా పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: కార్మికుల హక్కులకు భంగం కలిగించే లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో మీసేవా కేంద్రం వద్ద నిరసన చేపట్టారు. కార్యక్రమానికి వంగా గోపీ అధ్యక్షత వహించగా జి.సూర్యకిరణ్ మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు బి.రాంబాబు, ఎ.ప్రభాకరరావు, కె.సుబ్బారావు, స్టాలిన్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలి

అక్కడి ప్రజలు, రైతుల జీవించే హక్కు కాపాడాలని రౌండ్‌టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


సమావేశంలో మాట్లాడుతున్న బి.బలరాం

కొల్లేరు ప్రజల సమస్యల పరిష్కారానికి కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, ఎకోసెన్సిటివ్ జోన్, చిత్తడినేలల పరిరక్షణ పేరుతో పదో కాంటూరుకు పెంచరాదని, కొల్లేరు ప్రజలు, రైతుల జీవించే హక్కు కాపాడాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏలూరు కెనాల్ రోడ్డులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కొల్లేరు ప్రజలు, రైతుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఎ.రవి అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బి.బలరాం మాట్లాడుతూ 120 జిఒ కొల్లేరు ప్రజల జీవితాలను నాశనం చేసిందని, కొల్లేరును మూడో కాంటూరుకు కుదిస్తామని ఎన్నికల సందర్భంగా ఓట్ల కోసం హామీలిచ్చే రాజకీయ పార్టీలు గట్టు చేరాక బోడి మల్లన్న చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాల్లో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారని తెలిపారు. గతంలో చేపల చెరువులు తవ్వకూడదన్న ప్రభుత్వాలు నేడు వరిసాగు కూడా చేయకూడదని నిర్బంధానికి పాల్పడుతోందని ఆరోపించారు. 146 సొసైటీలు ఏర్పాటు చేసి 7100 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వకపోతే ఊరుకోబోమని ఆనాటి వెంగళరావు ప్రభుత్వం ఒత్తిడి చేసిందని గుర్తు చేశారు. ఇప్పటి ప్రభుత్వాలు దానికి భిన్నంగా మీరు చేపల చెరువులే కాదు, వ్యవసాయం కూడా చేయకూడదని ఆంక్షలు విధిస్తున్నాయన్నారు. ఇప్పటికే కొల్లేరులోని వేలాది మంది ప్రజలు పొట్ట కూటి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లిపోతున్నారని తెలిపారు. 120 జిఒ ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కొల్లేరును ధ్వంసం చేసిన సందర్భంలో కొల్లేరులో రెగ్యులేటర్లు కడతామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఉపాధి కల్పిస్తామని ఇచ్చిన హామీలన్నీ గాలికొదిలేశారని విమర్శించారు. కొంతమంది పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్ళినప్పుడు కొల్లేరు ప్రజలు, రైతులకు అండగా నిలవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు కేసులో ఇంప్లీడ్ కాకపోవడం అన్యాయమన్నారు. ఇప్పుడు మూడో కాంటూరు పరిస్థితి నుండి ఎకోసెన్సిటివ్ జోన్, చిత్తడి నేలల పరిరక్షణ పేరుతో 26 నిబంధనలను పెట్టి కొల్లేరు మొత్తాన్ని అష్ట దిగ్బంధనం చేసి పూర్తిగా అటవీశాఖ చేతుల్లోకి పెట్టబోతున్నారని తెలిపారు. ఇదే అమలైతే కొల్లేరు ప్రాంతమైన నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు, ఉండి, కాళ్ల, గణపవరం, పెంటపాడు మండలాల్లోని సుమారు 115 గ్రామాలపై ఈ ప్రభావం పడుతుందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అధికారులు తూతూమంత్రంగా అభిప్రాయాలు సేకరించి నివేదికలు పంపించడం దారుణమని, ఎకోసెన్సిటివ్ జోన్‌పై ప్రజలకు వాస్తవాలు తెలపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వడ్డి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఎస్.గాయత్రి, చేపల రైతుల సంఘం రాష్ట్ర నాయకులు నంబూరి వెంకటరామరాజు, మాజీ సర్పంచి ఘంటశాల మహాలక్ష్మిరాజు మాట్లాడుతూ కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, దీనికి గతంలో అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని, మోడీ ఇచ్చిన హామీని అమలు చేయాలని, కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కొల్లేరు ప్రజలకు జీవనోపాధి కల్పించాలని, 146 సొసైటీలు పునరుద్ధరించాలని, 14,800 ఎకరాలు జిరాయితీ భూమి హక్కుదార్లకు అప్పగించాలని కోరారు. ఎకోసెన్సిటివ్ జోన్, చిత్తడి నేలల పరిరక్షణ పేరుతో 10వ కాంటూరుకు విస్తరించరాదని, కొల్లేరు ప్రజల సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కొల్లేరు ఆపరేషన్ సందర్భంగా ఇచ్చిన హామీ అమలు చేయాలని, ప్రజలకు ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరారు. కొల్లేరులో ఉన్న వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు పేదలకు పంచాలని, ఆపరేషన్ కొల్లేరులో తీవ్రంగా నష్టపోయిన సొసైటీలు, జిరాయితీ రైతులు, వృత్తిదారులకు నష్టపరిహారం చెల్లించాలని, నిడమర్రు, భీమడోలు, ఉంగుటూరు తదితర ప్రాంతాల్లో ఇటీవల (అన్సర్వే, దొడ్డిగట్లు భూముల్లో) ఆపుచేసిన వరిసాగుకు అనుమతినివ్వాలని, అటవీ అధికారుల వేధింపులు, అవినీతి అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కొల్లేరు సమస్యపై రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యమై కార్యాచరణకు పూనుకోవాలని, అందులో ఒకపక్క న్యాయపరంగా, మరోపక్క ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేలా సంతకాల సేకరణ, తీర్మానాలు చేయడం, ప్రజల్లో అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలు చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు ఎంఎస్-ఎస్.గంగాధర్, ఎం.కొండలరావు, జి.పార్థసారథి, జి.ఖ్యాతి పుష్పశ్రీ, ఎ.కాశీరాజు తదితరులు మాట్లాడారు. సమావేశానికి ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ఆహ్వానంగా పలకగా, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.మహాంకాళిరావు, రైతుసంఘం నాయకులు కట్టా భాస్కరరావు, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.


మా ధాన్యం ఏ మిల్లుకు తోలుతున్నారో చెప్పడం లేదు

ధాన్యం సేకరణలో సమస్యలపై మంత్రి మనోహర్ ఎదుట వాపోయిన రైతులు

తుపాన్ కారణంగా ప్రభుత్వ స్థలాలు, భవనాల్లో ధాన్యం నిల్వ చేసుకోండి

రైతులు కోరిన మిల్లులకే ధాన్యం తోలాలి: మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

ధాన్యం సేకరణ లో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుం టుంటే క్షేత్రస్థాయిలో ఇంకా లోపాలు, సమస్యలు కన్పిస్తున్నాయని రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ఉంగుటూరు చేబ్రోలు, నారాయణ పురంలో ధాన్యం రాశుల వద్ద రైతులతో ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులతో కలిసి ముచ్చటించారు. ఈ సందర్భంగా ధాన్యం సేకరణలో సమస్యలను రైతులను అడిగి తెలుసుకున్నారు. చేబ్రోలుకు చెందిన ఓ రైతు మాట్లా డుతూ తనకు చేబ్రోలు ఆర్‌ఎస్‌కె-1, 2లో పొలం ఉందని, వేర్వేరుగా ఇకెవైసిలు చేయించామని తెలిపా రు. రెండు ఆర్‌ఎస్‌కెల్లో ధాన్యాన్ని ఒకే లారీలో తోలమంటే సిబ్బంది ఇబ్బంది పెడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై మంత్రి వ్యవసాయ శాఖాధికారులు, ఆర్‌ఎస్‌కె సిబ్బందిని ప్రశ్నిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరించాల్సిన కార్యాచరణపై సూచనలిచ్చారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు తోలుతున్నారో తమకెవరికీ చెప్పడం లేదని, అయితే ధాన్యం తోలిన 24 గంటల్లోపే సొమ్ము జమవుతుందని చెప్పారు. రైతులు నచ్చిన మిల్లుకే ధాన్యాన్ని తోలుకునే వెసులుబాటు ఉందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలిపారు. ధాన్యం ఏ మిల్లుకు తోలుతున్నారో రైతులకు సమాచారం ఎందుకు ఇవ్వడం లేదని మంత్రి వ్యవసాయ శాఖాధికారులను నిలదీశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్యాడీ అండ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని రూపొందిస్తే క్షేత్రస్థాయిలో ఇంకా లోపాలుంటున్నాయని, అధికారులు ఏం చేస్తున్నారని ఒకింత అసహనం వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడను మంత్రి ఆదేశించారు. నారాయణపురం ఆర్‌ఎస్‌కెలో ధాన్యం లారీలో లోడు చేసిన 48 గంటల వరకూ మిల్లులకు పంపలే దని రైతు అక్కిన వెంకటేశ్వరావు మంత్రికి ఫిర్యాదు చేశారు. సర్వర్ సమస్య కారణంగా ఆలస్యమైందని ఎఒ ప్రవీణ్‌కుమార్ వివరించారు. తుపాను కారణంగా రైతులు తమ ధాన్యం నిల్వ చేసుకునేందుకు ప్రభుత్వ స్థలాలు, ప్రాంగణాలను వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. ధాన్యం సేకరణలో టార్గెట్లు విధిస్తున్నారని, దీంతో రైతులు నష్టపోయే అవకాశం ఉందని నారాయణపురం సొసైటీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ మంత్రికి వివరించారు. ఉంగుటూరు, నాచుగుంట ఆర్‌ఎస్‌కెలకు టార్గెట్లు లేకుండా సేకరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఎస్‌పిచే సిఎం పర్యటనా ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ముఖ్యమంత్రి చంద్రబాబు డిసెంబర్ ఒకటో తేదీన గొల్లగూడెం పర్యటన నేపథ్యంలో జిల్లా ఎస్‌పి ప్రతాప్‌శివకిషోర్ బుధవారం మండలంలో పర్యటించారు. సిఎం పాల్గొనే సభా వేదికతోపాటు హెలీప్యాడ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజల రద్దీ అంచనా వేస్తూ ఎలాంటి ఇబ్బందులూ రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలను సమీక్షించారు. భద్రతా ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా గొల్లగూడెం ప్రాంతాన్ని ఎస్‌పి పరిశీలించారు. పెన్షన్లు ఇచ్చేందుకు సిఎం వెళ్లే ఇద్దరు లబ్ధిదారుల ఇళ్లను, వారి పూర్వపరాలను స్వయంగా ఆరా తీశారు. ఆయన వెంట జిల్లా అదనపు ఎస్‌పి ఎన్.సూర్య చంద్రరావు, డిఎస్‌పి డి.శ్రావణ్‌కుమార్, నిడమర్రు, భీమడోలు సిఐలు రజినీ కుమార్, విల్సన్, టిడిపి మండలాధ్యక్షుడు వేములపల్లి సుధీర్, గ్రామ సర్పంచి కరప వెంకట శ్రీనివాస్, తహశీల్దార్ పూర్ణ చంద్రప్రసాద్, ఎంపిడిఒ రాజ్‌మనోజ్ పాల్గొన్నారు.


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి, ఎఎస్‌పి

బుట్టాయగూడెం ఎంపిపిపై అవిశ్వాసం

అనుకూలంగా ఓటేసిన 11 మంది ఎంపిటిసిలు: ఎంపిపి సహా మరో ముగ్గురు గైర్హాజర్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


ఎంపిపి శాంతి

బుట్టాయగూడెం ఎంపిపిపై ఎంపిటిసిలు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన నేపథ్యంలో ఆర్‌డిఒ సమక్షంలో బుధవారం సమావేశం నిర్వహించినట్లు ఎంపిడిఒ జ్యోతి తెలిపారు. ఎంపిపి కారం శాంతిపై అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 11 మంది ఎంపిటిసిలు ఓటు వేశారని, ఇది సమావేశ మినిట్స్‌లో నమోదు చేసి కలెక్టర్ ద్వారా ఎన్నికల సంఘానికి నివేదిక పంపుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి గగ్గులోతు మోహన్‌రావు మాట్లాడుతూ మండలానికి సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో, నిధుల వినియోగంలోనూ ఎంపిటిసిలకు తెలియకుండా ఎంపిపి సొంతంగా ముందుకెళ్లారని, ఎంపిపి భర్త మండల పరిషత్ వ్యవహారాల్లో జోక్యం చేసుకొని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఎంపిటిసిలను పట్టించుకోకుండా సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో సెప్టెంబర్ 25న అవిశ్వాస తీర్మానంపై నోటీసిచ్చామని, దానిపై బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో 15 మంది ఎంపిటిసిలకుగాను 11 మంది ఎంపిటిసిలు పాల్గొని అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా ఓటు వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎంపిటిసిలు పాల్గొన్నారు.


అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్‌లో పాల్గొన్న ఎంపిటిసిలు

జనం జీవితాల్లో వెలుగులు నింపిన అంబేద్కర్

మంత్రి కొలుసు పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని రచించి, దేశ దిశ దశ మార్చి ప్రజల జీవితాల్లో గొప్ప వెలుగును నింపిన మహానుభావుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. మంత్రి క్యాంపు కార్యాలయంలో 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజ్యాంగ దినోత్సవాన్ని 'సంవిధాన్ దివస్' అని కూడా పిలుస్తారని, దీనిని జాతీయ న్యాయ దినోత్సవంగా కూడా పరిగణిస్తారని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు, ప్రాథమిక హక్కులు, మన పాలనా విధానం వంటి వాటిపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. గొప్ప రాజ్యాంగాన్ని మనకు అందించిన అంబేద్కర్‌కు ప్రతిఒక్కరూ ఘన నివాళులర్పించాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.


అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి

గ్రావెల్ తరలిస్తున్న లారీ పట్టివేత

ప్రజాశక్తి - భీమడోలు

ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని పోలవరం ప్రధాన కుడికాలువ గట్టుపై ఉన్న ప్రభుత్వానికి చెందిన ఎర్ర కంకరు (గ్రావెల్)ను అనుమతులు లేకుండా తరలిస్తున్న లారీని భీమడోలు సెంటర్‌లో పోలీసులు పట్టుకున్నారు. పొలసానిపల్లి విఆర్ఒ సాల్మన్ రాజు పోలీసుల సహకారంతో పట్టుకున్నారు. దెందులూరు మండలం ముప్పవరం గ్రామానికి చెందిన నరెడ్ల చిట్టిబాబు అదే గ్రామానికి చెందిన పత్తిపాటి పెద్దిరాజుకు చెందిన లారీపై డ్రైవర్‌గా పని చేస్తున్నారు. బుధవారం అదే లారీలో గ్రావెల్‌ను తరలిస్తూ పట్టుబడ్డారు. కేసు నమోదు చేసిన భీమడోలు పోలీసులు గ్రావెల్‌తో సహా లారీని సీజ్ చేశారు.

న్యాయం చేయాలని కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మొక్కజొన్న సీడ్ ఆర్గనైజర్ నుండి ద్వారకాతిరుమల మండలం హనుమాన్‌గూడెం మొక్కజొన్న విత్తన రైతులకు విత్తన పంట బకాయిలు ఇప్పించి ఆదుకోవాలని, రైతులకు అనుకూలమైన విత్తన చట్టం తేవాలని, విత్తన కంపెనీల నుండి రైతులకు అగ్రిమెంట్ ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, ఆంధ్రప్రదేశ్ విత్తన రైతుల సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మొక్కజొన్న విత్తన రైతులు బుధవారం జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. మాకు న్యాయం చేయాలని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు, కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ద్వారకాతిరుమల మండలంలోని పంగిడిగూడెం శివారు హనుమాన్‌గూడెంలో మొక్కజొన్న రైతులు సీడ్ ఆర్గనైజర్ చేతిలో మోసపోయారని, వారికి న్యాయం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 2025 విత్తన చట్టం ముసాయిదా కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేదిగా ఉందన్నారు. రైతులకు అనుకూలమైన విత్తన చట్టం తీసుకురావాలని కోరారు. ప్రస్తుత విత్తన మొక్కజొన్న పంట సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కంపెనీల నుండి రైతులకు అగ్రిమెంట్లు ఇప్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు గంటా పాపారావు, పాలేటి సుభాష్ చంద్రబోస్, గుర్రం పాపారావు, మోసపోయిన మొక్కజొన్న విత్తన రైతులు వీరవల్లి శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - పెదవేగి

జిల్లా ప్రైమరీ స్కూల్ హెచ్ఎం సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన పెదవేగి మండలం రామసింగవరం మోడల్ ప్రైమరీ ప్రధానోపాధ్యాయులు గుంటూరు శ్రీనివాసరావుకు మండల ఉపాధ్యాయుల తరపున శుభాకాంక్షలు తెలిపారు. గుంటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంకు ఏ సమస్య ఉన్నా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పరసా నాగార్జున, మేకా లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, డి.లాజరు. జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

11వ పిఆర్‌సి బకాయిలను విడుదల చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఫ్యాప్టో ఛైర్మన్ లంకలపల్లి సాయి శ్రీనివాస్ స్థానిక బాలగంగాధర్ తిలక్ ఉన్నత పాఠశాలను సందర్శించి అక్కడి ఉపాధ్యాయులతో చర్చించి పలు ఉపాధ్యాయ సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని, 11వ పిఆర్‌సి బకాయిలను వెంటనే విడుదల చేయాలని, 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించి ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి.రత్నాకర్‌రావు, జిల్లా అధ్యక్షులు పిబివిఎన్ఎల్.నారాయణ, ప్రధాన కార్యదర్శి కెఆర్.పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జియుకెటి విద్యార్థులకు ఎన్‌పిటిఇఎల్ సర్టిఫికెట్లు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

గత సెమిస్టర్‌లాగే ఈ సెమిస్టర్‌లో కూడా ఇ-3, ఇ-4 విద్యార్థుల కోసం వివిధ విభాగాల్లో మొత్తం 140 ఎన్‌పిటిఇఎల్ కోర్సులను ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ అందించింది. విద్యార్థులు ఈ కోర్సుల్లో చురుకుగా పాల్గొని అద్భుతమైన 97.5 శాతం విజయ శాతంతో సర్టిఫికెట్లు సాధించారు. నూజివీడు క్యాంపస్ విద్యార్థులు మొత్తం 2,473 సర్టిఫికేట్లు పొందగా, నాలుగు ఆర్‌జియుకెటి క్యాంపస్‌ల విద్యార్థులు మొత్తం 10,113 ఎన్‌పిటిఇఎల్ సర్టిఫికెట్లు సాధించారు.

రాజ్యాంగంపై మోడీ కుట్ర

ప్రజాశక్తి - చింతలపూడి

ప్రధాని నరేంద్ర మోడీ భారత రాజ్యాంగంపై కుట్ర చేస్తున్నారని ఎఐసిసి అబ్జర్వర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా పరిశీలకులు కెప్టెన్ ప్రవీణ్ దివాతర్ అన్నారు. పట్టణంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ కోఆర్డినేటర్, మాజీ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా అధ్యక్షతన సంస్థాగత నిర్మాణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రవీణ్ దవాతర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాజ్యాంగ నిర్మాణ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మండలాధ్యక్షులుగా మంగిన కొండ

ప్రజాశక్తి - పోలవరం

టిడిపి పోలవరం మండలాధ్యక్షులుగా మంగిన కొండ మంగళవారం ఎన్నికయ్యారు. ఈ ఎంపికపై టిడిపి మండల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ఆయన నివాసం వద్ద మంగిన కొండను పూలబొకేలతో శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. నీటి సంఘం మండలాధ్యక్షులు పాదం ప్రసాద్, ఎస్‌సి సెల్ నాయకులు యడ్ల వినోద్, టిడిపి సీనియర్ నాయకులు నల్లా రాంబాబు, ఆకుల రాజా, తదితరులు కొండను అభినందించారు.

నేరాలు - ఘోరాలు

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష పడింది. 2022లో ప్రేమ పేరిట యువతిని మోసం చేసి ఆమె ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో అత్యాచారానికి పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. దీంతో నిందితుడు శీలం సురేష్ (26)కు ఏలూరు ఐదో అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ఆర్‌వివిఎస్.మురళీకృష్ణ పదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో రెండు నెలల జైలు శిక్ష విధించాలని కోర్టు ఆదేశించింది. ఫిర్యాదుపై అప్పటి ఎస్ఐ సాగర్‌బాబు కేసు నమోదు చేయగా, ప్రస్తుతం పోలవరం ఇన్‌స్పెక్టర్ బాల సురేష్ బాబు దర్యాప్తు పూర్తి చేసి ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు.

వలసపల్లి, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో చోరీలు

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని వలసపల్లి, అక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో చోరీలు చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలసపల్లి గ్రామంలో బండారు పల్లి జయలక్ష్మికి చెందిన ఇంట్లో ఒక వ్యక్తి ఆరు నెలల నుంచి అద్దెకు ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 25వ తేదీ రాత్రి ఇంటి యజమాని జయలక్ష్మికి తీర్థంలో మత్తుమందు కలిపి ఇచ్చాడు. ఆమె మత్తులోకి వెళ్లాక ఎనిమిది కాసుల బంగారు గొలుసు అపహరించి పరారయ్యాడు.

అక్కిరెడ్డిగూడెం గ్రామంలోని పాస్టర్ సుందర్ సింగ్ ఈ నెల 25వ తేదీ రాత్రి కుటుంబంతో కలిసి ప్రార్థనకు వెళ్లి తెల్లవారుజామును వచ్చారు. ఈ క్రమంలో ఇంట్లో 15 కాసుల బంగారం, రూ.60 వేల నగదు చోరీకి గురైనట్లు బుధవారం ఉదయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ ఎ.చిరంజీవి, సిబ్బంది పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

జీలుగుమిల్లి : గోవులను కబేళాలకు తరలిస్తున్న వాహనాన్ని పోలీస్ స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై పట్టుకున్నట్లు పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒడిశా నుంచి తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కబేళాలకు గోవులను తరలిస్తున్న లారీని పట్టుకున్నారు. లారీని స్టేషన్‌కు తరలించి సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గోవులను గోశాలకు తరలించినట్లు తెలిపారు. ఈ దాడిలో సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ క్రాంతికుమార్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురం వంతెన ప్రారంభం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు కాలువపై నారాయణపురం వంతెనను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వంతెన పనులు చేపట్టిన గుత్తేదారుడు అక్కిన శేషును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద, మాజీ సర్పంచి అక్కిన నాగమణి, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, కూటమి నాయకులు అనిల్, రాంబాబు, సాయి, నాగరాజు పాల్గొన్నారు.

అమర వీరుల త్యాగాలు మరువలేనివి

ప్రజాశక్తి - టి.నరసాపురం

అమర వీరుల త్యాగాలు మరువలేనివని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్ తెలిపారు. మండలంలోని మర్రిగూడెం పంచాయతీలోని సున్నపురాళ్లపల్లిలో సత్తిరాజు స్థూపం వద్ద చంద్ర పుల్లారెడ్డి 41వ వర్ధంతి కార్యక్రమం జిల్లా కమిటీ సభ్యులు కొండ రాము అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ దోపిడీ, పీడన, వివక్షత లేని సమ సమాజం కావాలన్నారు. ప్రజలు అమరవీరుల పోరాట స్ఫూర్తితో సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు బత్తుల బాబూరావు, గ్రామ కమిటీ ఆదివాసీ సభ్యులు కాటయ్య, తొట్టి నాగేశ్వరరావు, వీరాస్వామి, చిన్న నాగేశ్వరరావు, గొంది ప్రసాద్, వరం రాములమ్మ, కనకయ్య, కోటేష్ పోతురాజు, మడకం వెంకటేష్, కాసిన రాంబాబు, ఆదివాసీ ప్రజలు పాల్గొన్నారు.

రైతులను మోసగించడం తగదు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వర్జీనియా పొగాకు రైతులను వ్యాపారులు, దళారులు, పొగాకు బోర్డు అధికారులు కలిసి సిండికేట్‌గా మారి మోసగిస్తున్న ఘటనలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తీవ్రంగా ఖండించింది. రైతులను ఉద్దేశపూర్వకంగా తక్కువ ధరలకు అమ్ముకునే పరిస్థితికి నెట్టివేయడాన్ని వెంటనే ఆపాలని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ హెచ్చరించారు. స్థానిక యుటిఎఫ్ భవనంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన పొగాకు రైతు సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని వర్జీనియా పొగాకు రైతులపై జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పొగాకు రైతులు బిక్కిన వీరసత్యం, సింహాద్రి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సింగరాయపాలెం షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి :జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న మండలంలోని సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం షష్ఠి కళ్యాణ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సవాలను ప్రారంభించారు. తొలి రోజు కావడంతో వేలాదిగా భక్తులు ఆలయానికి తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు యాత్రికులతో కిటకిటలాడాయి. వారి సౌకర్యార్థం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు అన్ని వసతి ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో కలపాలని ర్యాలీ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



మానవహారంలో న్యాయవాదులు

నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేయాలని, అప్పటివరకు ఆందోళన కొనసాగిస్తామని పలువురు న్యాయవాదులు అన్నారు. పట్టణంలో ప్రధాన రహదారుల్లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ గత వైసిపి హయాంలో జగన్ చేసిన జిల్లాల పునర్విభజనలో నూజివీడు నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేశారన్నారు. 2024 సాధారణ ఎన్నికలకు ముందు ప్రచారంలో భాగంగా ప్రస్తుత సిఎం చంద్రబాబు నూజివీడు నియోజకవర్గాన్ని ప్రజల ఆకాంక్షల మేరకు ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ మేరకు ఇటీవల మంత్రివర్గ ఉప సంఘానికి పలు సంఘాలు వినతి పత్రాలు అందించినప్పటికీ పరిగణలోకి తీసుకోకపోవడం దారుణ మన్నారు. నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో విలీనం చేసే వరకు ఆందోళన కొనసాగిస్తామని తెలిపారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలి

ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - ఉంగుటూరు



మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని టీచర్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. మండలంలోని నారాయణపురంలో ఉంగుటూరు యుటిఎఫ్ నూతన కార్యవర్గ ఎన్నిక అధ్యక్షులు వునుముల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బొర్రా గోపీమూర్తి, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, జిల్లా కార్యదర్శులు సిహెచ్.శ్రీధర్, కమల్ హాజరయ్యారు. యుటిఎఫ్ మండల గౌరవ అధ్యక్షులుగా శీతాల సత్యనారాయణ, అధ్యక్షులుగా వునుముల రాంబాబు, ఉపాధ్యక్షులుగా కత్తుల ఝాన్సీ రాణి, బొమ్మిడి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డాకి జోగినాయుడు, కోశాధికారిగా ఊట ఆనందకుమార్, సభ్యులుగా సలాది గణేష్, పివి.కన్నారావు, ఆకుల భవానీశ్వరరావు, బి.రత్నకిషోర్, సిహెచ్.రాణి, కె.ప్రేమ్‌కుమార్, డి.లక్ష్మీనారాయణ, కె.సోమరాజు, కొల్లి నాగపరమేశ్వరీ, ఎస్.ఉపేంద్ర, పైలా ఏడుకొండలు ఎన్నికయ్యారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా అల్లు శ్రీను, పిరిడి ప్రసాద్, పుప్పాల నరసింహారావు, కల్లపల్లి పోతురాజు, దారపురెడ్డి తులసీలక్ష్మీ, బి.సీతామహాలక్ష్మి, రేగాని రామకృష్ణ, ఎ.ప్రసాద్ రాజు, కె.హరికృష్ణ, తూతిక శివయ్య ఎన్నికయ్యారు. ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా తీడ శ్రీధర్ ఎన్నికయ్యారు.

హక్కులు హరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించిన హైకోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యుడు పిల్లి పోతురాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైసన్నగూడెం గ్రామంలోని సర్వే నెంబర్ 120/2లో ఉన్న నాలుగు ఎకరాల రాళ్లగుట్ట పోరంబోకు భూమిని పేదలు గత 20 ఏళ్లుగా మొక్కలు నాటి సాగు చేస్తున్నారని తెలిపారు. ఇటీవల గ్రామానికి చెందిన జి.అశోక్, కృష్ణ, చీమల మురళి రాత్రివేళ అక్రమంగా భూమిలోకి ప్రవేశించి జీడి, మామిడి, జామాయిల్ మొక్కలను నరికేశారన్నారు. బుధవారం విఆర్ఒ సురేష్‌ను కలిసి వినతిపత్రం ఇవ్వడానికి వెళ్లగా, ఆయన మహిళలను అవమానిస్తూ దుర్భాషలాడి వినతిపత్రం స్వీకరించడానికి నిరాకరించారని చెప్పారు. భూమిని పరిశీలించి, నరికిన మొక్కలపై రిపోర్ట్ తయారు చేసి, నష్టపరిహారం చెల్లిస్తూ నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలను అవమానపరుస్తూ దురుసుగా ప్రవర్తించిన విఆర్ఒ సురేష్‌ను తక్షణం విధుల నుంచి తొలగించాలని కోరారు. సమస్య పరిష్కరించకపోతే తహశీల్దార్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో బాధితులు పులపాకుల వీర్రాజు, పిల్లి వెంకట సుబ్బారావు, పిల్లి అమల, జి.దీప, పులపాకుల గంగ, పిల్లి మంగ, తదితరులు పాల్గొన్నారు.

నిరసన దీక్షకు తరలిన దళిత నాయకులు



నిరసన దీక్షలో దళిత నాయకులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

అంబేద్కర్ స్మృతివనాన్ని శిథిలావస్థకు చేర్చాలనే ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పికొడుతూ జడ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో విజయవాడలోని అంబేద్కర్ స్మృతివనం వద్ద బుధవారం చేపట్టిన నిరసన దీక్షకు ముదినేపల్లి దళిత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవాడ తరలివెళ్లారు. ఈ సందర్భంగా దళిత పరిరక్షణ కమిటీ అధ్యక్షులు నిమ్మగడ్డ బిక్షాలు మాట్లాడుతూ నిరసన కార్యక్రమం విజయవంతమైనట్లు తెలిపారు. నిరసన దీక్షకు వెళ్లిన వారిలో నాయకులు దాకారపు నాగమల్లేశ్వరరావు, సోమల వరప్రసాద్, లేళ్ల ఆంజనేయులు, పళ్లెం పుణేశ్వరరావు, గదాని కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, విష్ణువర్ధన్, నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులు రాజ్యాంగ పీఠికను అనుసరిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి ఎం.రామకృష్ణంరాజు, ఐదో అదనపు జిల్లా జడ్జి ఆర్‌విఎస్.మురళీకృష్ణ, ఏడో అదనపు జిల్లా జడ్జి వై.శ్రీనివాసరావు, ఎనిమిదో అదనపు జిల్లా జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, ఉమ్మడి న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు బాలల గ్రంథాలయంలో బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ వారి చేతుల మీదుగా పూలమాలవేసి భారత రాజ్యాంగ పుస్తకాలని ప్రదర్శించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు, కారంశెట్టి రమేష్‌బాబు మాట్లాడారు. అనంతరం పాఠకులతో రాజ్యాంగ పీఠిక సామూహిక పఠనం కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో బాలల గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వర్రె కొండలరావు, గోగు నరసింహారావు, ఎల్.చాముండేశ్వరరావు, గ్రంథాలయ నిర్వాహకురాలు మణిపూరి శోభ పాల్గొన్నారు.

స్థానిక సర్ సిఆర్.రెడ్డి పీజీ కళాశాల గ్రంథాలయ విభాగం ఎంబిఎ ఐక్యూ ఎసి ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంబిఎ డైరెక్టర్ డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కెమిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ బిఎస్ఎన్.మూర్తి మాట్లాడారు. రాజ్యాంగ ప్రస్తావన పఠన ప్రతిజ్ఞను డాక్టర్ తేర రాజేష్ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, డైరెక్టర్ విఆర్ఎస్.బాబు యలమర్తి, కార్యక్రమ కో-ఆర్డినేటర్ ఎం.రాజు పాల్గొన్నారు. అటానమస్ కళాశాల రాజనీతిశాస్త్రం, అర్థశాస్త్రం, చరిత్ర, ఐక్యూఎసి, ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 2 విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం కళాశాల ఆడియో విజువల్ హాలులో నిర్వహించారు.


జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద దళిత మహాసభ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సభ నిర్వహించారు. దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కొరబండి బాబూరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాల మహాసేన జాతీయ అధ్యక్షులు అలగ రవికుమార్, జై భీమ్ రాష్ట్ర అధ్యక్షుడు జివి.డేనియల్, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు పల్లా ఏసోబు, విజయ పాల్గొన్నారు.

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధానాచార్యులు డాక్టర్ గుత్తా గిరిబాబు అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమాన్ని రాజనీతి శాస్త్ర అధ్యాపకులు టి.వెంకటదుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.విజయకుమార్ సమన్వయం చేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

ఏలూరు సిటీ : ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించినట్లు ఎన్‌సిడి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నరేంద్రకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పూజ, డాక్టర్ ఆదిత్య, డెమో శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరు : భారత రాజ్యాంగం ప్రవేశికలోని అంశాలను విద్యార్థులు అధ్యయనం చేయాలని, వాటి అమలను పరిశీలించాలని ఎవిఆర్.విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, మానవతా అభివృద్ధి కమిటీ ఛైర్మన్ మేతర అజయ్‌బాబు, రిటైర్డ్ లెక్చరర్ డాక్టర్ ఎ.ఉత్తమ దుర్గ అన్నారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం, హేలాపురి బాలోత్సవం మానవత కమిటీల బృందం గజ్జల వారి చెరువు వద్ద ఉన్న నారాయణ స్కూల్, సెయింట్ తెరిసా జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీకృష్ణదేవరాయ హైస్కూల్, జింగిల్ బెల్స్ స్కూల్, ప్రభుత్వ బాలికల పాఠశాల ఆదిత్య ప్రభుత్వ బాలికల పాఠశాల ఆదిత్య డిగ్రీ కళాశాల, శనివారపుపేట హై స్కూలులో నిర్వహించిన సభలు ప్రతిజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

టి.నరసాపురం : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఒ జి.మణికుమారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొర్రంపాలెంలో ఎస్ఐ ఎం.జయబాబు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జెవి.రమణమ్మ, పంచాయతీ రాజ్ ఎఇ సంపత్ కుమారి, కలపర్తి విజయ్, రామకృష్ణ, గణపతి, మాణిక్యాలరావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో...

పోలవరం : కొత్తపట్టిసీమ గ్రామ పంచాయతీలో సర్పంచి మైగాపుల విజయదుర్గ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజలు, స్థానిక నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పంచాయితీ కార్యదర్శి కోట ప్రసాద్, ఎంపిటిసి సభ్యులు వలవల వరలక్ష్మి, సీనియర్ నాయకులు మైగాపుల దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొని రాజ్యాంగ ప్రమాణ స్వీకారం నిర్వహించారు.

కొయ్యలగూడెం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి గంజిమాల రామారావు, జనసేన టౌన్ అధ్యక్షుడు మాదేటి శ్రీను ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మండవల్లి : స్థానిక డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ సుధామ ఫౌండేషన్ అధినేత సుధా బత్తుల విజయకుమార్ మాట్లాడారు. రాజ్యాంగ పీఠికను చదివి రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఇటీవల మృతి చెందిన చిగురుపాటి సుకుమార్, లంకపల్లి సురేష్, మహారాజుల మృతికి సంతాపం తెలిపారు. అనంతరం భరత కుమార్ పుట్టినరోజు పురస్కరించుకొని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మిఠాయిలు, పెన్నులు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు, గాలి నాగయ్య, మెండ సురేష్, అధ్యక్షులు కొరపాటి శాంత రాజు, ఉపాధ్యక్షులు పాగొల్లు అభీష, కార్యదర్శి రవి వరప్రసాద్, ట్రెజరర్ వినోద్, ముఖ్య సలహాదారు గోరింక గాంధీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మెండ రాజేష్ పాల్గొన్నారు.

చింతలపూడి : లింగపాలెం మండలం ధర్మాజీగూడెం బస్టాండ్‌లో అంబేద్కర్ విగ్రహానికి చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏలూరు అర్బన్ : దళిత మహాసభ ఆధ్వర్యంలో..

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి ప్రధాన రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ యూత్ ప్రెసిడెంట్ మనోజ్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ములగలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, లక్ష్మీపురం ఎంపియుపి పాఠశాలలో నిర్వహించినట్లు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి అల్లాడి రాజు, హెచ్ఎం ప్రసాద్ తెలిపారు.

భీమడోలు : భీమడోలు హైస్కూల్లో విద్యార్థుల భాగస్వామ్యంతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. అసెంబ్లీ కార్యాలయ తరహాలో ఏర్పాటుచేసిన వేదికపై నిర్వహించిన కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. పాతూరు ఎంపిపి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు మండే సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భీమడోలు హైస్కూల్లో ఎంపిడిఒ పద్మావతి దేవి, విద్యాధికారి శ్రీనివాసరావు, కూటమి ప్రముఖులు కె.పెద్దిరాజు, యుగంధర్ పదో తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ సమకూర్చిన విజయకేతం పుస్తకాలు పంపిణీ చేశారు. వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కలిదిండి : మండలంలోని సానారుద్రవరంలో సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ జక్కుల మహేష్, కో - కన్వీనర్ శ్రీకాంత్, తలకటూరి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి : విజయ ఫార్మసీ కళాశాలలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కళాశాల విద్యార్థులు స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ లాయర్స్ పి.పవన్‌కాంత్, ఎ.రాంబాబు, డి.శివప్రసాద్, కళాశాల డైరెక్టర్ కె.తనూజ, ప్రిన్సిపల్ వై.వినయ్‌కుమార్, ముదినేపల్లి తహశీల్దార్ షేక్ లతీఫ్ పాషా, కళాశాల సిబ్బంది, పిఎల్‌విలు పాల్గొన్నారు. చినపాలపర్రు మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్ పోటీలు, రాత పరీక్షలు నిర్వహించారు. విజేతలకు హెచ్ఎం.ప్రసన్నకుమారి బహుమతులు అందించారు.

దెందులూరు : మానూరు ఎంపిపి పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు తేర ప్రసాద్, ఉపాధ్యాయురాలు తాలాడ అరుణ సంయుక్త అధ్వర్యంలో విద్యార్థులు భారత రాజ్యాంగ భారత రాజ్యాంగ పీఠిక ప్రవేశికను చదివి వినిపించారు. ఐదో తరగతి విద్యార్థిని తేర అశ్విని ఇంగ్లీషులో కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా ప్రతిజ్ఞ చూడకుండా చెప్పింది. చేబ్రోలు అనన్య తెలుగులో చెప్పింది.

ముసునూరు : మండలంలోని 16 గ్రామాల్లో పలువురు నాయకులు, అధికారులు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు, ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ సామ్యూల్, కార్యదర్శులు శ్రీనివాస చౌదరి, ముబీన సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు : నారాయణపురం పంచాయతీ కార్యాలయం వద్ద అంబేద్కర్ చిత్రపటానికి సర్పంచి అలకనంద పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ నేతల విజయ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగరంలోని పడమర వీధిలో ఉన్న గాంధీ మైదానంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీ నారాయణ దత్త ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో ఏలూరు ఆశ్రం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరానికి స్థానికులు విశేషంగా స్పందించారు. సొసైటీ అధ్యక్షుడు వీరంకి త్రినాధరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సహకరించిన బిల్డర్ మధ్యాహ్నపు శివశంకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ముగిసిన కార్యాచరణ ప్రణాళిక తయారీపై శిక్షణ

ప్రజాశక్తి - భీమడోలు

స్వయం సహాయక సంఘాలు మండల సమైక్య సహకారంతో ఆర్థికంగా ఇతర రూపాల్లో బలోపేతం అయ్యేందుకు ప్రస్తుతం రూపొందించిన 2026- 27 ఆర్థిక సంవత్సరపు వార్షిక కార్యాచరణ ప్రణాళిక - 2 సహకరిస్తుందని భీమడోలు వెలుగు సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ కె.రత్నకుమారి తెలిపారు. స్థానిక మండల సమైక్య కార్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కార్యాచరణ ప్రణాళిక తయారీ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. మండల సమైక్య కార్యాలయంలో నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సహాయ ప్రాజెక్టు మేనేజర్ పాల్గొన్నారు. తొలుత భీమడోలు ఎంపిడిఒ కార్యాలయ ఉద్యోగులు, వెలుగు కార్యాలయ సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి భారత రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ తరువాత జండర్ ర్యాలీని నిర్వహించారు. మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిసిలు రేఖా రమణి, నిర్మల, వరలక్ష్మి, వెంకటేశ్వరరావు, అకౌంటెంట్ సావిత్రి పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి అంతరాలయ దర్శనం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో ఈ నెల 27వ తేదీ నుంచి అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఒక్కరికి రూ.500 టిక్కెట్టు, రెండు చిన్న ఉచిత లడ్డూ ప్రసాదం ఇవ్వనున్నట్లు తెలిపారు. శని, ఆదివారాల్లో అంతరాలయ దర్శనం ముఖమండప దర్శనానికి అనుమతి ఉండదని తెలిపారు.